ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 30.01.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.
2. మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరలో సమ్మక్క అమ్మవారిని గద్దెలపైకి తీసుకురావడంతో భక్తులు భారీ సంఖ్యలో వనదేవతలను దర్శించుకుంటున్నారు.
3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 21వ శతాబ్దపు నాయకత్వంఅనే అంశంపై నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.
4. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 72వ మహిళల సీనియర్ నేషనల్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ రైల్వేస్, హర్యానా, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ సెమీఫైనల్ చేరుకున్నాయి.

-------------------------

**గాంధీ జయంతి**

ఈ రోజు జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని అమరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ బాపూ ఘాట్ వద్ద మహాత్ముడి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించారని కొనియాడారు. గాంధీ జీవితం మనకు ధైర్యం, సహనం,

మానవత్వం నేర్పిన అమూల్యమైన పాఠమని, ఆ ఆదర్శాలను మన జీవితాల్లో ఆచరించడమే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు.

**డెస్క్**

-----------------------------

మేడారం-జాతర

ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారలమ్మ మహా జాతర మూడో రోజు కొనసాగుతోంది. దేశ నలమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వన దేవతలను దర్శించుకుంటున్నారు. దీంతో అక్కడి రహదారులన్నీ రద్దీగా మారాయి. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గద్దెల వద్ద చీర, సారే, నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, మహా జాతరలో కీలక ఘట్టమైన సమ్మక్క అమ్మవారిని గద్దెలపైకి తీసుకొచ్చే వేడుక నిన్న రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. చిలకల గుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు ఆదివాసీ గిరిజన సాంప్రదాయాల నడుమ గద్దెలకు పయనమయ్యారు. ముందుగా సమ్మక్క ప్రధాన పూజారి కొక్కర కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివాసీ పూజారులు గుట్టపై ఉన్న సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క ఆగమనానికి ముందు పోలీసుల గౌరవ వందనంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

(పీటీసీ, ములుగు)

------------------------

**సీఎం-హార్వర్డ్**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్లో తన శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. 21వ శతాబ్దపు నాయకత్వంఅనే అంశంపై నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమ్రంతి ఈరోజు ముగించారు. శిక్షణ అనంతరం తన అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్న రేవంత్ రెడ్డి ఈ కోర్సులో భాగంగా తనతో పాటు 20 దేశాలకు చెందిన దాదాపు 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న సంస్కృతులు, దేశాల నుంచి వచ్చిన తోటి విద్యార్థుల ద్వారా ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో వివిధ విభాగాల్లో అత్యంత విజయవంతమైన వ్యక్తులను కలుసుకునే అవకాశం దక్కిందని, వారితో చర్చలు జరపడం మంచి అనుభూతిని ఇచ్చిందని వివరించారు.

డెస్క్

-------------------------

**దానం-స్పీకర్**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు వేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని కోరారు.

**HYD -PTC**

-------------------------

**సిరిసిల్ల-వ్యవసాయ అధికారి**

రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం వ్యవసాయ అధికారిణి వినీత చెప్పారు ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ....

**(బైట్ వినీత, వ్యవసాయ అధికారిణి)**

పిటిసి,రాజన్న సిరిసిల్ల జిల్లా

--------------------------

**మహబూబ్ నగర్**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ తెలిపారు. మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ స్వీకరణ కౌంటర్ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు.

**(Byte: జిల్లా ఎస్పీ డా. వినీత్ )**

**(పీటీసీ, MAHABUBNAGAR)**

-----------------------------

కబడ్డీ

హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 72వ మహిళల సీనియర్ నేషనల్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ రైల్వేస్, హర్యానా, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ సెమీఫైనల్ కు చేరుకున్నాయి. నిన్న రాత్రి జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ల్లో రైల్వేస్ జట్టు 58–23తో మహారాష్ట్రపై, హర్యానా 63–16తో మధ్య ప్రదేశ్ పై ఘనవిజయం సాధించాయి. మరో మ్యాచ్ లో తమిళనాడు 39–37తో చండీగడ్ జట్టును ఓడించగా చివరి మ్యాచ్లో హిమాచల్ ప్రదేశ్ 48–25తో పంజాబ్ పై గెలిచింది. ఈ సాయంత్రం జరిగే సెమీ ఫైనల్లో రైల్వేస్

జట్టుతో హర్యానా, తమిళనాడు  జట్టుతో హిమాచల్ ప్రదేశ్ జట్లు తలపడతాయి. ఇందులో గెలిచిన జట్లు రాత్రి జరిగే ఫైనల్లో తలపడతాయి.

**డెస్క్**

-----------------------

**సిరిసిల్ల-జాతర**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాల్లోని  గ్రామాల్లో  సమ్మక్క, సారలమ్మ జాతరలకు భక్తులు  పోటెత్తారు. తంగళ్లపల్లి మండలం  ఓబులా పూర్, మండెపల్లి, కోనరావుపేట మండలం శివంగళపల్లి, వీర్నపల్లి మండలం శాంతినగర్ గిరిజన తండా, బాబాయ్ చెరువుతండా, ఇల్లంత కుంట మండలంలోని ఇల్లంతకుంట, వంతడ్పుల, కందికట్కూర్ తదితర గ్రామాల్లో సమక్క, సారలమ్మలు గద్దెలపైకి చేరుకోవడంతో  అమ్మ వాళ్లను భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

**(సిరిసిల్ల, పీటీసీ)**

----------------------

**గద్వాల-మున్సిపల్**

జోగులాంబ గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు.జిల్లాల్లోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పురపాలక సంఘాలలో మొత్తం 77 వార్డులలో ఎన్నికల నిర్వహణకు 189 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.  ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని  కలెక్టర్ కోరారు.

**(గద్వాల జిల్లా, పిటిసి)**

----------------------